నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, శనివారం 22 మార్చి 2025 | KHAMMAM

## రాష్ట్రపతి భవన్‌లో తేనేటి విందు

పాల్గొన్న ఎంపీ వద్దిరాజు

ఖమ్మం, మార్చి 21: రాష్ట్రపతి భవన్‌లో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పలువురు ఎంపీలకు తేనేటి విందు ఇచ్చారు. బీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, కేఆర్ సురేశ్‌రెడ్డి, దీవకొండ దామోదర్‌రావు తదితరులతో కలిసి ఉదయం రాష్ట్రపతి అల్పాహారం తీసుకున్నారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ఆనవాయితీ ప్రకారం ఉభయ సభల సభ్యులను రాష్ట్రపతి తేనీటి విందుకు ఆహ్వానించారు.


రాష్ట్రపతి ముర్ముతో ఎంపీ వద్దిరాజు

## హరీశ్‌రావుకు ఎమ్మెల్సీ తాతా మధు ధన్యవాదాలు

ఖమ్మం, మార్చి 21: శాసనసభ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై అద్భుతంగా ప్రసంగం చేసిన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావుకు ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం శాసన సభ ఆవరణలో హరీశ్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలకు జరుగుతున్న నష్టాన్ని, బడ్జెట్ కేటాయింపుల్లోని డొల్లతనాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను అసెంబ్లీలో లేవనెత్తినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, దేశపతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


హరీశ్‌రావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు


మంగళగూడెంలో నెర్రెలు వారుతున్న వరి పొలం

## అప్పులు ఘనం-అభివృద్ధి శూన్యం

### 'మండలి' ఆవరణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీల నిరసన

ఖమ్మం, మార్చి 21: రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలు శుక్రవారం శాసనమండలి ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. 'అప్పులు ఘనం – అభివృద్ధి శూన్యం' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. 'అప్పులు ఆకాశంలో – అభివృద్ధి పాతాళంలో' అంటూ నినాదాలు చేశారు. 'రూ.1.58 లక్షల కోట్ల అప్పు చేసి, ఎంతమంది మహిళలకు రూ.2,500 చొప్పున ఇచ్చారు?' అని ప్రశ్నించారు. 'ఇంత భారీగా అప్పు చేసి ఎంతమంది వృద్ధులకు రూ.4,000 పెన్షన్ అందించారు?, ఎంతమంది ఆడపిల్లలకు స్కూటీలు ఇచ్చారు?, ఎంతమందికి తులం బంగారం అందించారు?' అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, ఎమ్మెల్సీలు కల్వకుంట్ల కవిత, తాతా మధు, సత్యవతి రాథోడ్, నవీన్‌రెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, చల్లా వెంకటరామిరెడ్డి, యాదవ్‌రెడ్డి, కోటిరెడ్డి పాల్గొన్నారు.



ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్సీ మధు

## 4 విడతల్లో 'ఇంటర్' మూల్యాంకనం

- జిల్లాకు మూడు లక్షల పేపర్ల కేటాయింపు
- నేటి నుంచి ప్రధాన సబ్జెక్టుల వాల్యుయేషన్

ఖమ్మం అర్బన్, మార్చి 21: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్ష పేపర్ల మూల్యాంకన ప్రక్రియ ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కేంద్రంగా నిర్వహిస్తున్నారు. నాలుగు విడతల్లో ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఫస్ట్ స్పెల్ ఈ నెల 22వ తేదీ నుంచి ఇంగ్లిష్, తెలుగు, హిందీ, గణితం, పొలిటికల్ సైన్స్ పేపర్లు, సెకండ్ స్పెల్ 24వ తేదీ నుంచి ఫిజిక్స్, ఎకనామిక్స్ పేపర్లు, థర్డ్ స్పెల్ 26వ తేదీ నుంచి కెమిస్ట్రీ, కామర్స్ పేపర్లు , ఫోర్త్ స్పెల్ 28వ తేదీ నుంచి హిస్టరీ, బోటనీ, జువాలజీ పేపర్లు వాల్యుయేషన్ చేయనున్నారు. ఈ పేపర్ల కోసం చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్క్రూట్నీ నైజర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌లు, ఏసీవోలను నియమించారు. సంస్కృతం పేపర్ ఈ నెల 10వ తేదీన ప్రారంభమైంది. ప్రక్రియను క్యాంప్ ఆఫీసర్ కె.రవిబాబు పర్యవేక్షిస్తున్నారు.


మూల్యాంకనం వివరాలు వెల్లడిస్తున్న ఖమ్మం డీఐఈవో రవిబాబు

**జిల్లాకు చేరిన 1,83,415 పేపర్లు..**


జిల్లాలో జరిగే మూల్యాంకన కేంద్రానికి 2,97,766 సమాధాన పత్రాలను బోర్డు కేటాయించింది. వీటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన ఇతర జిల్లాల్లోని విద్యార్థుల సమాధాన పత్రాలు ఉంటాయి. శుక్రవారం నాటికి 1,83,415 సమాధాన పత్రాలు ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్యాంప్‌నకు చేరాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్లను బోర్డు నియమించింది. సంస్కృతం–29 మంది, తెలుగు–80, ఇంగ్లిష్–107, హిందీ–10, గణితం–157, సివిక్స్–48, హిస్టరీ– 25 మందిని కేటాయించారు. వీరు క్యాంప్ ఆఫీసర్‌కు రిపోర్ట్ చేయనున్నారు.

# యాసంగి ఆశలు ఆవిరి

- మంగళ గూడెంలో నెర్రెలు వారుతున్న వరి పొలాలు
- కొద్దిపాటి తడులతో నెట్టుకొస్తున్న కొందరు కర్షకులు
- ఆ కాస్త సాగునీరూ అందని దైన్యంలో మరికొందరు రైతులు
- రూ.వేలకు వేలు వెచ్చించి బావులు, కాలువల్లో పూడిక తీతలు
- కిలో మీటర్ల మేర పైపులతో ఇంకొందరి భగీరథ యత్నాలు
- వెన్నారం చెరువు తూము తెరిచి నీళ్లు ఇవ్వాలంటూ వేడుకోలు

**యాసంగి పంటలు చేతికొచ్చే సమయంలో సాగునీరు సరిపడా లేకపోవడంతో ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. దిక్కుతోచని స్థితిలో ఆవేదనకు గురవుతున్నారు. మండలంలో ఒక వైపు సాగర్ కాలువ ఉధృతంగా ప్రవహిస్తున్నది. మరోవైపు గతంలో తవ్విన ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాలువ కూడా అందుబాటులో ఉంది. వీటికి తోడు గ్రామానికి తలాపున చెరువు కూడా ఉంది. ఆ చెరువులో పుష్కలంగా నీళ్లు కూడా ఉన్నాయి. కానీ.. ఆ నీళ్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆ గ్రామ రైతులు వారం రోజులుగా తర్జనభర్జన పడుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే పంటలను వదిలేశారు. మరికొందరు రైతులు వాగులు, బావుల్లో పూడిక తీస్తూ భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ.. ప్రభుత్వం మాత్రం వీరి పంటలను కాపాడేందుకు కనీస చర్యలు కూడా తీసుకోవడం లేదు. –ఖమ్మం రూరల్, మార్చి 21**


వాగులో అడుగంటిన నీరు


పొలంలో తవ్విన బావి

మంగళగూడేనికి చెందిన దాదాపు 50–60 మంది రైతులు(వీరిలో సగం మంది కౌలు రైతులు) ఏటా వానకాలం, యాసంగి సీజన్లలో పక్కనే ఉన్న వెన్నారం చెరువు(డోర్నకల్ మండలం) ఆయకట్టు కింద వరి సాగు చేసున్నారు. మరికొందరు రైతులు సమీప వాగులపైనా, తమ బావులపైనా ఆధారపడి యాసంగి పంటలు వేస్తున్నారు. ఈ ఏడాది ఈ గ్రామ రైతుల పరిస్థితి 'రెంటికీ చెడ్డ రేవడి..' అనే నానుడిలా దయనీయంగా మారింది. వానకాలం పంటలన్నీ అధిక వర్షాలు, వరదలకు దెబ్బతిన్నాయి. ఆ లోటును పూడ్చుకునేందుకు ఇప్పుడు యాసంగి వేస్తే కనీసం నీళ్లు అందే పరిస్థితి లేకుండా పోయింది. వెన్నారం చెరువులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ ఆ మండల అధికారులు తూములు బంద్ చేశారు. దీంతో మంగళగూడెం పొలాలకు నీళ్లు అందడం లేదు. పైగా ఇక్కడ భూగర్భ జలాలు లేకపోవడంతో బావులు కూడా పూర్తిగా అడుగంటాయి. ఈ క్రమంలో పొట్ట దశలో పంటలకు నీళ్లు అందించేందుకు రైతులు చేయని ప్రయత్నం లేదు.

### తూము తెరిస్తేనే పంటలు చేతికొచ్చే అవకాశం

ఖమ్మం రూరల్ మండలం మంగళగూడెం, డోర్నకల్ మండలం వెన్నారం గ్రామాల మధ్యలో ఉన్న చెరువుపై ఆధారపడి మంగళగూడెం రైతులు ఈ యాసంగిలో సుమారు 200 ఎకరాల్లో వరి పంట వేశారు. అయితే, చెరువులోని చేపల కోసమని అక్కడి అధికారులు, రైతులు తూము నుంచి నీళ్లు వదలడం లేదు. ఇదే సమయంలో మంగళగూడెంలో వాగు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం వంటి కారణాలతో ఇక్కడి రైతులు సాగునీటి కోసం అరిగోస పడుతున్నారు. పంటలు పొట్ట దశకు చేరుతున్న ఈ సమయంలో సాగునీరు ఎంతో అవసరం. ఈ తరుణంలో నీళ్లు అందకపోతే అవి పూర్తిగా ఎండిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.వేల అప్పులు తెచ్చుకొని మరీ పెట్టుబడులు పెట్టిన తమ మొరను స్థానిక మంత్రి పొంగులేటి ఆలకించాలని వేడుకుంటున్నారు. చెరువు తూము నుంచి కనీసం రెండు రోజులపాటు నీరు వదిలేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### వరుస తడులతో నెట్టుకొస్తున్నా..



వారం, పది రోజులుగా పొలానికి వరుస తడులు పెడుతున్నాను. ఈ ఏడాది మూడు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట వేశాను. వానకాలంలో వరదలు, భారీ వర్షాలతో ఆ సీజన్‌లో ఏమీ మిగలలేదు. ఇప్పుడు చూడబోతే ఇట్లుంది. బావులున్నా వాటిల్లో నీళ్లు లేవు. మడిమడికీ పైపులు వేసి సాదుకుంటున్నా. పంట చేతికి రాకపోతే ఆగమవుడు తప్ప ఏమీలేదు.

–మాచర్ల వీరయ్య, కౌలు రైతు, మంగళగూడెం

### తూము తెరిస్తేనే పంట బయటపడుతుంది



చెరువు తూము వదిలితే తప్ప పంట చేతికొచ్చే అవకాశం లేదు. రూ.వేలకు వేలు ఖర్చు చేసి పంటను కాపాడుకుంటున్నా. రెండు కిలోమీటర్ల మేర పైపులు వేసుకున్నా. వేరే బావిలో పూడిక తీయించి నీరు తెచ్చుకుంటున్నా. వెన్నారం చెరువులో నీరు పుష్కలంగా ఉంది. చేపల కోసమని వాటిని వదలట్లేదట. కనీసం రెండు రోజులు వాగు సాగినా బాగుండు.

–మేకల సత్యనారాయణ, రైతు, మంగళగూడెం

## 'ఎర్ర బంగారం' ధర పతనం


రఘునాథపాలెం, మార్చి 21: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 'ఎర్ర బంగారం' ధర రోజురోజుకూ పతనమవుతున్నది. ఒకానొక దశలో రూ.14 వేలకు చేరిన మిర్చి క్వింటా ధర.. గత 4 రోజుల్లోనే రూ.500 తగ్గింది. నిరుడు ఇదే సమయంలో రూ.23 వేలు ఉన్న మిర్చి ధర ఇప్పుడు సగం ధర మాత్రమే పలుకుతోంది. అందుకు ప్రధాన కారణం మార్కెట్‌లో తిష్టేసిన దళారులేనని స్పష్టమవుతోంది. నిరుడు మిర్చి ధర మార్కెట్‌లో రూ.20 వేల పైచిలుకు ధర పలికినప్పటికీ వ్యాపారులు కొనుగోలు చేశారు. క్వింటా మిర్చి రూ.30 వేలకు చేరుతుందనే ఆశతో పెద్దఎత్తున వ్యాపారులంతా రైతుల వద్ద నుంచి పంటను కొనుగోలు చేసి నిల్వ చేసుకున్నారు. అయితే మార్కెట్ వ్యాపారుల ఆశలు అడియాశలయ్యాయి. రైతుల వద్ద నుంచి వ్యాపారుల చేతికి పంట వచ్చినంక మిర్చి ధర పూర్తిగా తగ్గిపోయింది. దీంతో వ్యాపారులు చేసేది లేక.. గోదాముల్లో నిల్వ చేసుకోలేక అగ్గువకు అమ్ముకున్నారు. అయితే నిరుటి నష్టాన్ని పూడ్చుకునే ఆలోచన చేసి ఈ ఏడాది వ్యాపారులంతా సిండికేట్ అయ్యారనే ఆరోపణలు మార్కెట్‌లో వినిపిస్తున్నాయి. ఫలితంగా మిర్చి ధర క్వింటా రూ.13,500 వద్దనే ఆగిపోయింది. మొదట రూ.14,300 వరకు చేరినప్పటికీ ఆ తరువాత రోజురోజుకూ తగ్గుముఖం పడుతూ వచ్చింది. చివరకు నాణ్యమైన మిర్చి ధర మాత్రం గరిష్టంగా రూ.13,500 చొప్పున వ్యాపారులు విక్రయిస్తున్నారు. ఇక తేమశాతం, నలుపురంగు పేరుతో వ్యాపారులు చెప్పిందే రేటుగా కొనసాగుతోంది.


ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు భారీ సంఖ్యలో వచ్చిన మిర్చి బస్తాలు

## బ్యాంకును బురిడీ కొట్టించబోయాడు..
# తానే బుక్కయ్యాడు..

- కూసుమంచి తహసీల్దార్ పేరిట తప్పుడు గుర్తింపు కార్డు సృష్టి
- పైగా దానిపై సాక్షాత్తూ ఖమ్మం కలెక్టర్ సంతకం, స్టాంపు ముద్రణ
- వాటితో హైదరాబాద్ ఎస్‌బీఐలో వ్యక్తిగత రుణానికి దరఖాస్తు
- పరిశీలనలో గుర్తించిన హైదరాబాద్ జూబ్లీపుర బ్రాంచ్ అధికారులు
- కూసుమంచిలో వాకబు చేసి తప్పుడు వ్యవహారమంటూ నిర్ధారణ

కూసుమంచి, మార్చి 21: సాక్షాత్తూ బ్యాంకును బురిడీకొట్టించేందుకు ప్రయత్నించిన ఓ కేటుగాడు చివరికి తానే అడ్డంగా బుక్కయిన ఘటన కూసుమంచి, హైదరాబాద్‌లలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏకంగా కూసుమంచి తహసీల్దార్ పేరిట తప్పుడు పత్రాలతో హైదరాబాద్ ఎస్‌బీఐలో వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు చేయడం, విచారణలో భాగంగా సదరు దరఖాస్తుదారుడు తప్పుడు వివరాలు అందించాడని బ్యాంకు గుర్తించడం వంటి పరిణామాలు కూసుమంచిలో చర్చనీయాంశంగా మారాయి. అయితే, 'పీఎం కిసాన్' పేరిట కొందరు సైబర్ నేరగాళ్లు కూసుమంచి రైతు ఖాతా నుంచి రూ.3.4 లక్షలను కాజేసి వారం రోజులు గడవక ముందే.. తాజా మోసం కూడా వెలుగులోకి రావడం గమనార్హం. బ్యాంకు అధికారుల కథనం ప్రకారం..



కూసుమంచి తహసీల్దార్‌గా కలెక్టర్ సంతకంతో ముద్రించుకున్న కార్డు

జంగం బాలరాజు అనే వ్యక్తి తాను కూసుమంచి తహసీల్దార్‌నని పేర్కొంటూ 'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, రెవెన్యూ డిపార్ట్‌మెంట్' పేరిట తప్పుడు గుర్తింపు కార్డు సృష్టించుకున్నాడు. దానిపై ఏకంగా కలెక్టర్ సంతకం, స్టాంపు కూడా ముద్రించుకున్నాడు. 'తండ్రి: చంద్రమౌళి, తహసీల్దార్ ఎంప్లాయి ఐడీ: 2025192, కూసుమంచి' పేరిట ఐడెంటిటీ కార్డు తయారు చేసుకున్నాడు. ఈ వివరాలతో కూడిన దరఖాస్తును తన మనిషికి ఇచ్చి హైదరాబాద్‌లోని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) జూబ్లీపుర బ్రాంచ్ అధికారుల వద్దకు పంపాడు. 'మా సార్ కూసుమంచిలో తహసీల్దార్‌గా పనిచేస్తున్నారు. అక్కడే నివాసం ఉంటున్నారు. వ్యక్తిగత రుణం కోసం దరఖాస్తు పంపారు' అని చెప్పి ఆ దరఖాస్తును అక్కడి అధికారులకు అందించాడు. తరువాత దరఖాస్తు పరిశీలనలో భాగంగా ఎస్‌బీఐ జూబ్లీపుర బ్రాంచ్ అధికారులు ఎస్‌బీఐ కూసుమంచి బ్రాంచ్ మేనేజర్ సురేందర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారు. కూసుమంచి ఎస్‌బీఐ మేనేజర్ వెంటనే స్థానిక తహసీల్దార్ కార్యాలయ అధికారులను వాకబు చేశారు. ప్రస్తుత తహసీల్దార్ కరుణశ్రీ అని, జంగం బాలరాజు పేరిట గతంలోనూ ఇక్కడ ఎవరూ పనిచేయాలని నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని జూబ్లీపుర బ్రాంచ్ అధికారులకు తెలియజేశారు. దీనిపై జూబ్లీపుర బ్రాంచ్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ కరుణశ్రీ, ఎస్‌బీఐ మేనేజర్ సురేందర్‌లను 'నమస్తే తెలంగాణ' సంప్రదించగా.. జంగం బాలరాజు పేరిట ఇప్పుడుగానీ, ఇంతకుమునుపుగానీ ఇక్కడ ఎవరూ పనిచేయలేదని స్పష్టం చేశారు.

## 'పది' పరీక్షలు షురూ..

- ఖమ్మం జిల్లాలో 26 మంది, భద్రాద్రి జిల్లాలో 34 మంది గైర్హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన భద్రాద్రి కలెక్టర్, అబ్జర్వర్, డీఈవోలు


ఖమ్మంలో విద్యార్థులు, తల్లిదండ్రులు





ఖమ్మంలో డీఈవోను తనిఖీ చేస్తున్న సిబ్బంది


బాబూక్యాంపు పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న భద్రాద్రి కలెక్టర్


కుమార్తెకు జాగ్రత్త చెప్తున్న తల్లి



ఖమ్మం అర్బన్, మార్చి 21: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష కావడంతో విద్యార్థులు తమ ఇష్టదైవాలకు పూజలు చేసి పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకున్నారు. అధికారులు పరీక్ష కేంద్రాల్లోకి పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన తర్వాతే విద్యార్థులను పంపించారు. ఖమ్మం జిల్లాలో తెలుగు పరీక్ష 16,417 మందికి.. 16,391 మంది విద్యార్థులు రాశారని, 99.84 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ప్రైవేట్‌లో 21 మందికి.. 17 మంది హాజరయ్యారు. అడిషనల్ డైరెక్టర్, రెండు జిల్లాల అబ్జర్వర్ ఎస్.విజయలక్ష్మి బాయి నగరంలోని రిక్కాబజార్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నయాబజార్, తల్లంపాడు, నాయకన్‌గూడెం ఉన్నత పాఠశాలల్లోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. డీఈవో సోమశేఖర శర్మ.. కొణిజర్ల, తనికెళ్ల, పాండురంగాపురం, నారాయణ స్కూల్, నయాబజార్, టేకులపల్లి, శ్రీచైతన్య స్కూల్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్ 38 కేంద్రాలను తనిఖీ చేశారు. 97 పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు అధికారులు 163 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేశారు. కాగా.. ప్రతీ కేంద్రం వద్ద సెంటర్ కోడ్‌తోపాటు డీఈవో, ఎంఈవోల ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని ఆదేశించినా చాలా చోట్ల అమలు కాలేదు. నగరంలోని చాలా కేంద్రాల్లో ఎంఈవోల నెంబర్లు తప్పుగా వేయగా, కొన్ని ప్రధాన కేంద్రాల వద్ద ఫోన్ నెంబర్లు కనిపించలేదు.

### భద్రాద్రి జిల్లాలో..

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మార్చి 21: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 73 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 12,269 మంది రెగ్యులర్ విద్యార్థులకు.. 12,235 మంది పరీక్ష రాశారు. 99 శాతం హాజరు నమోదైంది. ప్రైవేట్ విద్యార్థులు 25 మందికి.. 18 మంది హాజరయ్యారు. జిల్లాలోని రెండు సెంటర్లను కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఏడు కేంద్రాలను డీఈవో వెంకటేశ్వరాచారి, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 29 కేంద్రాలను తనిఖీ చేశారు.

## ఆశా కార్యకర్తల నిరసన

**అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు దుమ్ముపేట, అశ్వారావుపేట, బూర్గంపాడు మండలాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ఎదుట శుక్రవారం ప్లకార్డులతో నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపట్టారు. –అశ్వారావుపేట/ దమ్మపేట, మార్చి 21**



దమ్మపేటలో ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు


అశ్వారావుపేటలో నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు